## క్లుప్తంగా

### కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలి

**బద్వేలు అర్బన్ :** పట్టణంలో వీధి కుక్కల బారి నుండి ప్రజలను కాపాడాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని కోరారు. వినాయకుడి విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కలను తరలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు కుక్క కాటుకు గురవుతున్నారని, పట్టణంలో సంచరిస్తున్న వీధికుక్కలను తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఓబుల్‌రెడ్డి, షబ్బీర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### బాణసంచా పేలి నలుగురికి గాయాలు

**బ్రహ్మంగారిమఠం :** మండలంలోని రేకలకుంట పంచాయతీ బాగాదిపల్లెలో వినాయకుని నిమజ్జనంలో బాణ సంచా పేలి శుక్రవారం ప్రమాదవశాత్తు నలుగురికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108లో బద్వేల్‌కు తరలించారు. పాలకొండయ్య, జగదీష్, లోకేష్, దుక్కేష్లకు గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు.

### సకాలంలో స్వామిత్వ సర్వే చేయాలి

**రాజుపాళెం :** గ్రామాల్లో నివాస గృహాలకు సంబంధించి స్వామిత్వ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని జమ్మలమడుగు డివిజనల్ పంచాయతీ అధికారి నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొర్రపాడు, ఏరువపాళెం గ్రామ పంచాయతీలలో స్వామిత్వ ర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా గ్రామాల్లో ఇళ్లకు సంబంధించిన యాజమాన్య హక్కులపై న్యాయపరమైన ధ్రువీకరణను ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షాకీర్‌ఆలీఖాన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కపిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ధ్యాన్ చంద్‌కు నివాళి

**ప్రొద్దుటూరు :** స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శుక్రవారం హాకీమాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ధ్యాన్ చంద్ హాకీలో వరుసగా మూడు ఒలంపిక్స్‌లో మన దేశానికి స్వర్ణ పతకాలను సాధించారని కొనియాడారు. డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘవ, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు నడిగడ్డ సుధాకర్‌రెడ్డి, పీఎల్‌టీయూ కన్వీనర్ గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**చాపాడు :** స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి పాల్గొన్నారు.

### కేసు నమోదు

**కాశినాయన :** మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన మురుకూటి పెంచల్ రెడ్డి తన పొలంలో సేద్యం చేసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మురుకూటి వెంకటసుబ్బారెడ్డి, చిన్న సుబ్బిరెడ్డి మరో ఇద్దరు మహిళలు పెంచల్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారని ఎస్ఐ యోగేంద్ర శుక్రవారం తెలిపారు. వెంకటసుబ్బారెడ్డి, చిన్న సుబ్బిరెడ్డి, మరో ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### క్రీడా సామగ్రి అందజేత

**ప్రొద్దుటూరు :** మండలంలోని కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్, గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి రూ.10వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వేళంగ్ కుమార్‌కు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ షేక్ అల్లాబకాష్ మేజర్ ధ్యాన్ చంద్ జీవిత విశేషాలను, జాతీయ క్రీడా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు వేళంగ్ కుమార్, తెలుగు భాషోపాధ్యాయుడు బద్రిపల్లె శ్రీనివాసులు తెలుగు భాషా ప్రాముఖ్యత, గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

**బద్వేల్ అర్బన్ :** పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి అన్నారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత – వ్యాధులు దూరం అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడంతో దోమలను నివారించవచ్చునన్నారు. అనంతరం లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. దోమలు బారి నుంచి కాపాడుకునేందుకు దోమ తెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంగయ్య, జనార్ధనరావు, శ్రీరాములయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జై బోలో గణేష్ మహరాజ్‌కీ

**బద్వేలు అర్బన్ :** జై బోలో గణేష్ మహరాజ్‌కీ అంటూ పట్టణంలోని గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు. పట్టణ పరిధిలో ఏర్పాటుచేసిన 155 వినాయక విగ్రహాలలో దాదాపు 82 విగ్రహాలను శుక్రవారం మేళతాళాల నడుమ నిమజ్జనానికి తరలించారు. ఆయా మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. అనంతరం యువకుల కేరింతలు, బాణాసంచా పేలుళ్ళు, తప్పెట్ల మోతల మధ్య నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన చెక్కభజన, కోలాటం ప్రజలను ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్, రూరల్ సీఐలు ఎస్.లింగప్ప, ఎన్.క్రిష్ణయ్యల ఆధ్వర్యంలో గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ నాలుగు రోడ్ల కూడలి నుండి డ్రోన్ కెమెరాలతో బందోబస్తును పర్యవేక్షించారు.



బద్వేలు అర్బన్ : కొండారెడ్డివీధిలో హోమంలో పాల్గొన్న భక్తులు

**లడ్డూ రూ.1.89 లక్షలు**

స్థానిక తెలుగుగంగ రోడ్డులోని నారాయణ స్కూల్ దగ్గర ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మూడవ రోజు నిమజ్జనం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వామి వద్ద ఉంచిన లడ్డూను రూ.1.89 లక్షలకు మణ్యంశంకర్‌రెడ్డి పాడుకుని సొంతం చేసుకున్నారు. అలాగే వెంకటయ్యనగర్‌లోని రెండవ లైన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఉంచిన లడ్డును సంటెయ్య రూ.76 వేలకు దక్కించుకున్నాడు.

**భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనం**

**మైదుకూరు :** పట్టణంలోని పలు వినాయక ప్రతిమలను భక్తిశ్రద్ధలతో కుందూ నదిలో నిమజ్జనం చేశారు. మండలంలోని అన్నలూరు అరవింద్‌నగర్‌లో శుక్రవారం గ్రామానికి చెందిన కల్లూరి రామిరెడ్డి 10 కిలోల లడ్డును రూ.4 లక్షలకు వేలంలో దక్కించుకోగా, తోట వెంకటరామిరెడ్డి 15 గ్రాముల వెండి కాయిన్‌ను రూ.1.20 లక్షలకు, తోట భరత్‌రెడ్డి చెరకు గడలను రూ.10 వేలకు పాడి సొంతం చేసుకున్నారు. మైదుకూరులోని శీలం నగర్‌లో జరిగిన వేలంలో స్వామివారి లడ్డు ప్రసాదాన్ని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, ఆయన కుమారుడు మాచనూరు సాగర్‌లు రూ.2.16 లక్షలకు దక్కించుకున్నారు. తిప్పిరెడ్డిపల్లెలో కొట్టి నరసింహులు రూ.1.20 లక్షలకు లడ్డును, కోటయ్యగారి రఘుపతి రూ.45వేలకు కలశం చెంబును, కొండిశెట్టి బాలుడు రూ.14 వేలకు చెరకు గడలను వేలంలో సొంతం చేసుకున్నారు.

**దువ్వూరులో..**

**దువ్వూరు :** మండలంలోని గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలో 130 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా 64 విగ్రహాలను శుక్రవారం దువ్వూరు, రాంసాయినగర్ కేసీ కెనాల్‌లో, పెద్దజొన్నవరం జిల్లెల్ల, నేలటూరు గ్రామాల విగ్రహాలను కుందూ నదిలో, చల్లబసాయపల్లె, మదిరేపల్లె, చిన్నసింగనపల్లె, మనేరంపల్లె, గుడిపాడు గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ఎస్ఆర్ డ్యాంలో నిమజ్జనం చేశారు. దువ్వూరులోని వనం వీధిలో వినాయకుని లడ్డు రూ.65వేలకు, నోట్ల దండను రూ.80వేలకు చెన్నంశెట్టి సురేంద్ర దక్కించుకున్నారు.

**బ్రహ్మంగారిమఠం :** మండలంలోని సోమిరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన ఘననాథుని నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలంవేయగా గ్రామానికి చెందిన పోచంరెడ్డి మంగమ్మగారి పెద్ద సుబ్బిరెడ్డి రూ 56వేలకు దక్కించుకున్నాడు. స్వామికి వేసిన మాల ను చవ్వా సుబ్బిరెడ్డి రూ 27వేలు, కలశంను ఉప్పతి చలపతి రూ2,700లకు, చెరుకు గడలు రూ 1600లకు ఇరగ దిద్ల భాను తక్కించుకున్నారు.

**రాజుపాళెం :** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం ఆయా గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు.వెల్లాల, టంగుటూరు, వెలవలి, కూలూరు గ్రామాల సమీపాన ఉన్న కుందూనది వంతెనల వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్ఐలు రామకృష్ణా రెడ్డి, సిద్దయ్య, రెవెన్యూ అధికారులు, పోలీసుల బందోబస్తు నిర్వహించారు.

**బద్వేల్ :** వినాయకచవితి పర్వదినం సందర్భంగా ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. గత మూడు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో గణనాధులకు పూజలు నిర్వహించారు. శుక్రవారం రాచాయపేటలో గణనాధుని లడ్డును రూ.25 వేలకు ఆదూరిశివారెడ్డి దక్కించుకున్నారు. మండలంలోని ఆకుతోటపల్లెలో వినాయక లడ్డూను లక్ష రూపాయలకు బోవిల్ల చిన్న నరసింహారెడ్డి, పార్వతమ్మ దంపతులు దక్కించుకున్నారు.

**చాపాడు :** మండల వ్యాప్తంగా శుక్రవారం గణేషుడి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలో కొలువుదీనిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి సీతారామాపురం, అన్నవరం, శ్రీరాములపేట, మిడుతూరు వద్ద గల కుందూనదిలో నిమజ్జనం చేశారు. అల్లాడుపల్లె గ్రామంలో వినాయకుడి ఊరేగింపు వేడుకల్లో శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన చైర్మన్ వీరనారాయణదవ్ పాల్గొన్నారు. కుందూనది వద్ద పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీకేడ్లను ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు.

**ఏకదంతుడికి ప్రత్యేక పూజలు**

**ప్రొద్దుటూరు కల్చరల్ :** మిట్టమడి 9వ వీధిలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకదంతునికి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



బి.మఠం : సోమిరెడ్డిపల్లెలో వినాయకుడి లడ్డు ప్రసాదాన్ని తీసుకువెళ్తున్న పెద్దసుబ్బిరెడ్డి



మైదుకూరులో నిమజ్జనానికి వెలుతున్న గణనాథుడు



బద్వేలు అర్బన్: రూ.1.89 లక్షలకు లడ్డును సొంతం చేసుకున్న శంకర్‌రెడ్డి



ప్రొద్దుటూరు కల్చరల్: మిట్టమడి వీధిలో కొలువైన ఏకదంతుడు



దువ్వూరులో నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయక విగ్రహాలు



గోపవరం : రాచాయపేటలో లడ్డును దక్కించుకున్న శివారెడ్డి



కాశినాయన: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



అట్లూరు: లడ్డూను దక్కించుకున్న నరసింహారెడ్డి

# ఎగ్జిబిషన్, మార్కెట్‌లకు టెండర్లు లేవా?

**మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి**

**ప్రొద్దుటూరు :** మున్సిపల్ యాక్ట్ ప్రకారం ప్రతి నెల కౌన్సిల్ సమావేశాలను నిర్వహించాల్సి ఉండగా కమిషనర్ రవిచంద్రారెడ్డి గాలికి వదిలేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ అవసరాన్ని బట్టి ప్రతి నెల పలు కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు నెలకు సంబంధించి కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని పలు మార్లు కోరినా కమిషనర్ రవిచంద్రారెడ్డి స్పందించలేదన్నారు. ఈ నెల 14న తన సీసీ ద్వారా కమిషనర్‌కు చెప్పి పంపడం జరిగిందని తెలిపారు. సాధారణ సమావేశానికి గడువు ముగియడంతో 24 గంటల్లోపు అత్యవసర సమావేశం అయినా నిర్వహించాలని కోరామన్నారు. ఇంత వరకు కమిషనర్ స్పందించలేదన్నారు. దసరా ఎగ్జిబిషన్, కూరగాయల మార్కెట్ వేలం పాట అంశాలను మున్సిపల్ అజెండాలో పొందుపరచాల్సి ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా తెలిపారు. అసలు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించకుండానే ఎగ్జిబిషన్, మార్కెట్ టెండర్లను కూటమి నేతలకు అప్పగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. కమిషనర్ కూటమి నేతలకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడితే అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కమిషనర్ నిర్వాకంపై జిల్లా కలెక్టర్, ఆర్డీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని, అవసరమైన కోర్టులో వేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మున్సిపల్ యాక్ట్ చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు

# తెలుగు భాష పురస్కారం ప్రదానం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో శుక్రవారం సాహిత్య కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా భాషాభిమాని, ప్రముఖ పారిశ్రామిక వేత్త మెట్టుపల్లి రామచంద్రారెడ్డి తెలుగు భాష ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ పాటపడాలని తెలిపారు. మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు చేసిన భాషా సేవను కొనియాడారు. సాహిత్య భారతి కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తెలుగు భాష పట్ల మమకారాన్ని పెంచుకొని మాతృభాషను ఆదరించాలని కోరారు. భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విద్వాన్ గానుగపెంట హనుమంతరావుకు గిడుగు రామమూర్తి పంతులు భాషా పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిన్నకళావతి, డాక్టర్ సీఏ సాధు గోపాలకృష్ణ, ఆరవేటి రాజా, ప్రభుకుమార్, మద్దిలేటి, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, కాలే దేవానంద్, సహదేవుడు, చాడా మునిశేఖర్‌రెడ్డి, మైదుకూరుకు చెందిన అధ్యాపకుడు రవికల్యాణ్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న గానుగపెంట హనుమంతరావు

# సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

**రాజుపాళెం :** సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించాలని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం తెలిపారు. వారు మండలంలోని చిన్నశెట్టిపల్లె, కూలూరు గారమాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బృందం డీపీఎంఓ నాగ శశిభూషణ్, ఎస్ఓ రమేష్ రెడ్డి, డీపీఓ కుమార్ నారాయణ, పీహెచ్ఎన్ శాంతికళలు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. అంతేకాకుండా రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు మంజుల, సీహెచ్ఓ సుభాషిణి, సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, సరస్వతి, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

# ‘యూరియా కొరతను సృష్టించింది మీరే’


**మైదుకూరు :** రైతులకు అవసరమైన సమయంలో యూరియాను అందించకుండా కొరతను సృష్టించింది పాలక వర్గాలు, అధికారులేనని సీపీఐ నాయకులు ఆరోపించారు. రైతులకు ఏరియాను సరఫరా చేసే విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను సరఫరా చేయాలని కోరుతూ కార్యాలయ ఏఈఓ కాంతమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు పి.శ్రీరాములు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలై రైతులందరూ పంటలు వేసుకొనే సమయంలో యూరియా కొరతను సృష్టించి యూరియాను సరఫరా చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. యూరియాను పాలకవర్గాలు అధికారులు కృత్రిమ కొరత సృష్టించారని ఆరోపించారు. యూరియా సరఫరా చేయకుండా అవసరమైన రైతులు ఇతర ఎరువులను వేల రూపాయలు పెట్టి కొన్న తర్వాత యూరియాను పంపిణీ చేస్తామని చెప్పడం శోచనీయమన్నారు. వెంటనే రైతులందరికి యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎస్.షావలి, పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి పవన్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.పీరయ్య, పుల్లయ్య, చేతన్ పాల్గొన్నారు.

### ఆస్పత్రి వద్ద ఆందోళన


**ప్రొద్దుటూరు క్రైం :** పట్టణంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ వద్ద ముద్దనూరు మండలానికి చెందిన వ్యక్తులు శుక్రవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. ముద్దనూరు మండలానికి చెందిన ఆరేళ్ల బాలికకు జ్వరం రావడంతో 24న ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స చేసినా రక్తకణాలు తగ్గడంతో 26న బాలికను కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలిక 27 రాత్రి మృతి చెందింది. దీంతో బాలిక బంధువులు ప్రొద్దుటూరులోని హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. పెద్ద మనుషులు సర్దిచెప్పడంతో ముద్దనూరు వాసులు వెళ్లిపోయారు. ఈ విషయమై హాస్పిటల్ డాక్టర్ మాట్లాడుతూ బాలికకు చికిత్స అందించి కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలిపారు. ఇందులో తమ నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.

### కుమారుడితో సహా తల్లి అదృశ్యం

**ప్రొద్దుటూరు క్రైం :** తన భార్య, మూడేళ్ల కుమారుడు కనిపించడం లేదని చెంగల్‌రాయుడు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. వరద చెంగల్‌రాయుడు ప్రొద్దుటూరులోని రామేశ్వరంలో నివాసం ఉంటున్నాడు. అతను బీరువాలు తయారి ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. అతని మొదటి భార్య సుమిత్రకు 5 ఏళ్ల సాయికృష్ణ, 3 ఏళ్ల తేజేంద్ర అనే కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పెద్దల అనుమతితో సుమిత్రి చెల్లెలు నాగలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల చిన్న కుమారుడు తేజేంద్ర పుట్టిన రోజు విషయంలో ఇంట్లో చిన్నపాటి గొడవ జరిగింది. ఈ కారణంగా సుమిత్ర ఈ నెల 25న తన చిన్న కుమారుడు తేజేంద్రను తీసుకొని ఆస్పత్రికి వెళ్తున్నట్లు భర్తకు ఫోన్ చేసి చెప్పింది. ఆస్పత్రికి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భర్త చెంగల్‌రాయుడు పట్టణంలో గాలించాడు. బంధువుల ఊళ్లలోనూ ఆమె కోసం విచారించినా వారి ఆచూకి తెలియలేదు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం చెంగల్‌రాయుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



సుమిత్ర (ఫైల్)



తేజేంద్ర (ఫైల్)

### నడిరోడ్డుపై నాట్లు వేసి నిరసన

**పోరుమామిళ్ల :** పట్టణంలోని సాయిబాబా మందిరం వద్ద నడిరోడ్డుపై అఖిల భారత మానవహక్కుల సంఘం నాయకులు నాట్లు వేసి నిరసన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణ నడి రోడ్డులో నీటి మడుగు ఏర్పడింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

### ధ్యాన్‌చంద్ జీవితం ఆదర్శం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** మండల పరిధిలోని లింగాపురంలో ఉన్న రాయలసీమ వ్యాయామ కళాశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ధ్యాన్‌చంద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హాకీ క్రీడకు ఆయన చేసిన సేవను గొప్పతనాన్ని వివరించారు. ఉదయం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు కబడ్డీ పోటీలను నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు, వ్యాయామ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలుగు భాషాదినోత్సవం

**పోరుమామిళ్ల :** పట్టణంలోని వైష్ణవి పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషాదినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగు భాష ఎంతో మాధుర్యం కలిగిందన్నారు. హాకీలో రాణించి ప్రపంచాన్ని ఆశ్చర్య పరచిన మేజర్ దయాచంద్ పుట్టినరోజున క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.



విజేతలతో ఉపాధ్యాయులు

**అధికారికంగా నిర్వహించాలి**

**పోరుమామిళ్ల :** తెలుగుభాషా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహాకవి గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా పాటిస్తున్న తెలుగుభాషా దినోత్సవం ఆధునిక సవాళ్లు, ప్రాచీన వారసత్వం, తెలుగుభాష సంరక్షణ, భవిష్యత్తు తదితర అంశాలను గుర్తు చేసుకోవడానికి అవకాశముందన్నారు.

**మైదుకూరు :** మండలంలోని వనిపెంట మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయినులు తెలుగు భాష ఔన్నత్యం గురించి, వ్యవహారిక భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషిని విద్యార్థినులకు వివరించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ ఒలంపిక్ క్రీడల్లో దేశానికి పతకాలను సాధించి పెట్టారని, ఆయన జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. విద్యార్థినులు పాఠశాల ఆవరణలో రంగవల్లులను తీర్చిదిద్దారు. తెలుగు తల్లి వేషధారణతో తెలుగు భాష గొప్పతనం గురించి మాట్లాడారు. తెలుగు ఉపాధ్యాయినులు టీఎస్ దస్తగిరమ్మ, కె.రాజేశ్వరి, బి.ప్రత్యూష విద్యార్థినులను అభినందించారు.

**వైభవంగా తెలుగు భాషా దినోత్సవం**

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక వసంతపేటలోని శ్రీసరోజిని హైస్కూల్‌లో శుక్రవారం వైభవంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రతి ఏటా ఆగస్టు 29న నిర్వహించుకుంటున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. తెలుగు భాష గొప్పతనాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తెలుగు పాటలు, గేయాలు, పద్యాలు ఆలపించారు.

# తెలుగు తల్లి విగ్రహానికి వినతుల హారం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ పార్కులోని తెలుగు తల్లి విగ్రహానికి రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రాలతో మాల కూర్చి వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో తెలుగు మాధ్యమం తప్ప ఉర్దూ, తమిళ, కన్నడ, ఒరియా, మరాఠి తదితర మాధ్యమ పాఠశాలలు ఉన్నాయన్నారు. తెలుగు మాధ్యమం తీసివేయడం వలన విద్యార్థుల చదువు అంతంత మాత్రంగానే కొనసాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలోకి రాక ముందు తెలుగు మాధ్యమం కొనసాగిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు దాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన ఎన్టీఆర్ తెలుగు భాషకు అగ్ర తాంబూలం ఇచ్చిన విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు మరిచి పోయారని విమర్శించారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగు మాధ్యమం తీసివేయడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు పెద్ద శాపం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడి విశ్రాంత తెలుగు పండితులు మద్దిలేటి, రాష్ట్ర భాషాపోధ్యాయ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, జిల్లా నాయకులు సుధాకర్, సుబ్బారెడ్డి, తెలుగు అధ్యాపకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



తెలుగు తల్లి విగ్రహానికి వినతుల హారం వేసి నిరసన తెలుపుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి